క్లుప్తంగా

దేవాలయాల పరిరక్షణకు కృషి చేయాలి

బోట్‌క్లబ్: హిందూ దేవాలయాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు ఆర్.రవిశంకర్ పట్నాయక్ అన్నారు. స్థానిక గాంధీనగర్ ఓలేటివారి వీధిలో గురువారం పరిషత్ కాకినాడ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హైందవ శంఖారావ సభ డిక్లరేషన్, హైందవ శాఖారావ సంకల్ప ప్రతిజ్ఞ చేయించారు. శంకర, రామానుజ, మధ్వ ఆచార్య వంటి పూజ్య ధర్మాచార్యులు అందించిన సనాతన ధార్మిక మార్గంలో అందరూ నడవాలన్నారు. హిందూ ధర్మంపై ఏవిధమైన దాడులు జరిగినా తక్షణం స్పందిస్తూ ఉండాలని, హిందూ దేవాలయాల రక్షణ, స్వయం ప్రతిపత్తి కోసం జరుగుతున్న జాతీయ మహోద్యమంలో భాగస్వాములు కావాలన్నారు. సంస్కృత ప్రచార ప్రముఖ్ చల్లా శ్రీకృష్ణవాణి మాట్లాడుతూ భగవద్గీత పోటీలు నవంబర్ నుంచి జరుగుతాయని, పాఠశాల, కళాశాలల విద్యార్థులు, మహిళలు, పురుషులు కూడా పాల్గొనవచ్చన్నారు. పరిషత్ సభ్యులు బిక్కిన రాజు, గోవిందు, గరిమెళ్ల అన్నపూర్ణయ్య శర్మ, జి.ఉదయ భానోజీరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యలోనే వదిలేశారు



సీతారామ కాలనీలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభం

సామర్లకోట: విద్యుత్తు శాఖ నిర్లక్ష్యం వాహనచోదకులకు ప్రాణసంకటంలా మారింది. స్థానిక రెండో వార్డు సీతారామ కాలనీ, ఇందిరాపార్కు రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం ఉంది. దీనిని గమనించక చాలామంది ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ స్తంభాన్ని మార్పు చేయాలని అనేక పర్యాయాలు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆ వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ అన్నారు. నిబంధనల ప్రకారం రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ సంభాన్ని ఎటువంటి ఫీజులు చెల్లించకుండా మార్చాలని, అయినా మార్చడం లేదని వైఎస్సార్ సీపీ నాయకుడు పాలిక చంటిబాబు అన్నారు. దీనిపై శుక్రవారం జరిగే కౌన్సిల్ సమావేశంలో చర్చించి, తీర్మానం చేసి ట్రాన్స్‌కో అధికారులకు పంపేలా చర్యలు తీసుకుంటామని కుసుమ చెప్పారు.

కరాటేలో విజేతకు సత్కారం



కరాటేలో విజేత ప్రణుతిని అభినందిస్తున్న ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు

సామర్లకోట: ఇటీవల విశాఖపట్నంలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ముప్పిడి ప్రణుతి అండర్-12 విభాగంలో బంగారు పతకం సాధించింది. దాంతో ఆ గ్రామ ఉప సర్పంచ్ యవర్న చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బాలికను అభినందించారు. సామర్లకోటలో కరాటే కోచ్ శంకర్ వద్ద ఆమె శిక్షణ తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. రోజూ ఉదయం కరాటే శిక్షణకు మూడు కిలోమీటర్లు వెళ్లి నేర్చుకోవడంతో తగిన ఫలితం దక్కిందని చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ అచ్చారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దాపురం: న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం పెద్దాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐలు జిల్లా ప్రధాన కార్యదర్శి గదిమెళ్ల శ్రీభాస్కరాచార్యులు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో లా నేస్తం పేరుతో జూనియర్ న్యాయవాదులకు శిక్షణ భృతి (స్టైఫండ్) రూ.ఐదు వేలు ఇచ్చేవారని, జూనియర్ న్యాయవాదులకు వృత్తిలో నిలదొక్కుకునేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడేదన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ పిఠాపురం బహిరంగ సభలో తాము అధికారంలోకి వస్తే న్యాయవాదులకు ప్రత్యేక సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. సాధారణ ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు విజయవాడలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే న్యాయవాదులకు న్యాయమిత్ర పథకం కింద నెలకు రూ.ఐదు వేల నుంచి రూ.పది వేల భృతి ఇస్తానని హామీ ఇచ్చారన్నారు. న్యాయమిత్ర పథకం లబ్ధిదారుల సంఖ్య 2,670 నుంచి 3,500కు పెంచుతామని, రూ.వంద కోట్లతో న్యాయవాదులకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసి ఆర్థికంగా తోడ్పాటునందిస్తామని, ప్రతి న్యాయవాదికి రూ.ఐదు లక్షల ఆరోగ్య బీమా, రూ.15 లక్షల ప్రమాద బీమాతో పాటు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిన సంగతి కూటమి ప్రభుత్వం పక్కన పెట్టిందన్నారు. అధికారం చేపట్టి 15 నెలలు కావొస్తున్నా ఇచ్చిన హామీల అమలు ఊసే లేదన్నారు. న్యాయవాదులకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోని బార్ అసోసియేషన్ల వద్ద న్యాయవాదులతో సంతకాల సేకరణ, కరపత్రాల పంపిణీ చేపట్టి నిరసన కార్యక్రమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఐయ్యో..లాండ్..

- నగరంలో కానరాని ఐలాండ్ల సుందరీకరణ
- మహనీయుల విగ్రహాల వద్ద పిచ్చిమొక్కలు



ఫెలోషిప్ చర్చి సెంటర్ వద్ద పొట్టి శ్రీరాములు ఐలాండ్‌లో..



గాంధీనగర్ గాంధీబొమ్మ సెంటర్‌లో పిచ్చి మొక్కలతో నిండిన గాంధీ ఐలాండ్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): పెన్షనర్ల పేరడైజ్‌గా కాకినాడకు పేరుంది.. కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసిన స్మార్ట్ సిటీల్లో ఒకటి. స్మార్ట్ సిటీ అవార్డులు అందుకున్న ఘనత కూడా ఉంది. అలాంటి నగరంలో పలు జంక్షన్ల సుందరీకరణ వెనుకబాటులోనే ఉంది.. జంక్షన్లలోని ఐలాండ్స్ పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లోని గాంధీ విగ్రహ ఐలాండ్ వద్ద పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. నిర్వహణ లేక ఇక్కడ అధ్వానంగా తయారైంది. హౌస్ ఆఫ్ ప్రేయర్ సమీపంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం, రామారావుపేటలో పొట్టి శ్రీరాములు విగ్రహ ఐలాండ్‌లు పిచ్చిమొక్కలు, పొదలతో నిండుకున్నాయి. మొక్కలు తొలగించి సుందరంగా తీర్చిదిద్దాల్సిన సంబంధిత అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు. కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో డబ్బులు చెల్లిస్తున్నా, స్మార్ట్ సిటీ స్థాయిలో సుందరీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం లేదనే వాదన వినిపిస్తుంది.

సంరక్షణ లేక..

రోడ్లపై డివైడర్లు, జంక్షన్ ఐలాండ్‌ల వద్ద గతంలో ఆకర్షణీయ మొక్కలు వేశారు. వీటి సంరక్షణను అధికారులు పట్టించుకోక ప్రస్తుతం అక్కడ పిచ్చి మొక్కలు కనిపిస్తున్నాయి. అలాగే ఎండిపోయిన మోడులు దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా ఇక్కడ వేసిన మొక్కలను పశువులు తినేయడంతో ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా మారింది. పిచ్చి మొక్కలు, పొదలు పెరిగిపోతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న వారు ఆయా జంక్షన్లలో పరిస్థితిని చూసి ముక్కున వేలేసుకుంటున్నారు.

రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లుగా..

నగరంలో పశువుల సంచారం అధికమైంది. రోడ్లపై ఎక్కడికక్కడే తిష్ట వేస్తున్నాయి. ఇవి మొక్కలను తినేయడంతో పాటు రోడ్ల మధ్యలోనే ఉండడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. రాత్రిళ్లు పలు ప్రాంతాల్లో రోడ్లపైనే పశువులు ఉండడంతో వాటిని గుర్తించని వాహనచోదకులు ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి, ఐలాండ్‌లను సుందరంగా మార్చడమే కాకుండా పశువుల సంచారంపై తగిన చర్యలు తీసుకోవాలని నగర వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఒంటిమామిడి జంక్షన్‌లో రాత్రి పూట రోడ్డుపైనే పశువుల తిష్ట

సుందరీకరణపై దృష్టి సారించాలి



కాకినాడలో ఆశించిన స్థాయిలో సుందరీకరణ పనులు జరగడం లేదు. పచ్చదనం కనుమరుగవుతోంది. ముఖ్యంగా నాలుగు రోడ్ల కూడళ్లలో ఉన్న ఐలాండ్స్‌ను తీర్చిదిద్దితే నగరానికి కొత్త శోభ వస్తుంది. ఆ దిశగా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

–అప్పలనాయుడు, కాకినాడ

పశువుల సంచారంతో ఇబ్బంది



నగరంలో పశువుల సంచారంతో ఇబ్బంది ఎదురవుతోంది. ఇవి రోడ్లపైనే నిద్రిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే రోడ్లను అభివృద్ధి చేయాలి. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక వర్షం వస్తే రోడ్లపై నీరు నిలిచిపోతుంది. అధికారులు ఈ సమస్యలను పట్టించుకోవాలి.

–నాని, రామారావుపేట

బార్ అసోసియేషన్‌కు గుర్తింపు తేవాలి



న్యాయవాదులను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు

కాకినాడ లీగల్: న్యాయవాదుల క్రికెట్ పోటీల్లో స్థానిక బార్ అసోసియేషన్‌కు జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలని బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఏలూరి సుబ్రహ్మణ్యం, చెక్కపల్లి వీరభద్రరావు (చంటి) కోరారు. నవ్యాంధ్ర అడ్వకేట్ క్రికెట్ అసోసియేషన్ (ఎన్ఏఏసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి ఢిల్లీలో జరిగే ఆల్ ఇండియా అడ్వకేట్స్ 20-20 క్రికెట్ టోర్నమెంట్లో ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్‌గా కాకినాడ బార్ అసోసియేషన్ న్యాయవాది దొంతుమళ్ల అశోక్‌కుమార్, అలాగే మరో న్యాయవాది గింజాల చక్రవర్తికి చోటు దక్కింది. వీరిని గురువారం బార్ అసోసియేషన్ హాలులో సత్కరించారు. ఢిల్లీలో జరగబోయే 20-20 క్రికెట్ టోర్నమెంట్‌లో న్యాయవాదులు అశోక్‌కుమార్, చక్రవర్తి తమ సత్తా చాటి కాకినాడకు మంచి పేరు తేవాలని అధ్యక్షుడు ఏలూరు సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు కోరారు. ఆ ఇద్దరు న్యాయవాదులను రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు నరహరిశెట్టి రవికృష్ణ, న్యాయవాదులు అభినందించారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం సజీవం



ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న స్మారక కళావేదిక సభ్యులు

బోట్‌క్లబ్: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సజీవంగా లేకున్నా, ఆయన పాటలు చిరస్థాయిగా నిలిచిపోయాయని ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మారక కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు దోకుబుర్ర రామరాజు అన్నారు. స్థానిక దంటు కళాక్షేత్రంలో గురువారం కళావేదిక ఆధ్వర్యంలో ఎస్పీ బాలు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన పాట వినిపించని ఇళ్లు ఉండదన్నారు. అటువంటి గాయకుడు లేకపోవడం సినీ లోకానికి తీరని లోటన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు ఇజ్రాయిల్, సీహెచ్ ధర్మారావు, సాల్మన్‌రాజు, ఎం.రామారావు, వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యంతో అధిక దిగుబడులు



పంట పొలంలో శత్రు, మిత్ర పురుగుల గురించి వివరిస్తున్న ఎంఏఓ సత్య

కరప: వరి సాగులో ఎరువుల యాజమాన్య పద్ధతులు అనుసరిస్తే, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని ఎంఏఓ ఇమ్మిడిశెట్టి సత్య అన్నారు. గురువారం కొంగోడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ ఎరువుల యాజమాన్య పద్ధతులు, శత్రు, మిత్ర పురుగుల గురించి వివరించారు. సూటి ఎరువులైన నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను అవసరం మేరకే వాడాలన్నారు. వీటితో పాటు సూక్ష్మ ధాతువు ఎరువులైన జింక్, బోరాన్, ఐరన్, మెగ్నీషియాన్ని అవసరానికి అనుగుణంగా వినియోగిస్తే సాగు ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. మొక్క అవసరాలను గుర్తించి సరైన మోతాదులో ఎరువులు అందిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. తర్వాత రైతులను పొలాల్లోకి తీసుకెళ్లి శత్రు, మిత్ర పురుగుల గురించి అవగాహన కల్పించారు. పొలాల్లో ఉండే మిత్ర పురుగులైన తూనీగలు, మిడతలు, కందిరీగలు, అక్షింతల పురుగులు, బిళ్ల పురుగులు, సాలీడు, నీటి నల్లులు గుర్తించి, అవిచేసే మేలును తెలిపారు. శత్రు పురుగులైన వరి ఈగలు, పచ్చదోమలు, ఆకుచుట్టు పురుగులు, కాండం తొలుచు పురుగులు, ఉల్లికోడు, రెల్లరాల్చు పురుగులు, సుడిదోమలు గురించి తెలిపి, వాటివల్ల కలిగే అనర్థాలను వివరించారు. వ్యవసాయ విస్తరణాధికారులు ఎంవీ సతీష్, బండారు శ్రీరాములు, వీఏఏలు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

దీనదయాళ్ ఉపాధ్యాయకు నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు

కరప: పెనుగుదురులో గురువారం పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతిని బీజేపీ నాయకులు నిర్వహించారు. తొలుత దీనదయాళ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పుట్టా వీరప్రసాద్ గాంధీ మాట్లాడుతూ సమ సమాజంకోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అందరికీ ఆదర్శమన్నారు. మండల పార్టీ ఉపాధ్యక్షుడు తుమ్మలపల్లి గోవిందు, వెంపల లక్ష్మణరావు, నాగేశ్వరరావు, ముమ్మిడి పెద్దకాపు, వీరబాబు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

బోట్‌క్లబ్: దీనదయాళ్ ఉపాధ్యాయ సేవలు మరువలేనివని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. దీనదయాళ్ జయంతి సందర్భంగా స్థానిక గాంధీనగర్ క్షత్రియ పరిషత్ కమ్యూనిటీ హాల్లో గురువారం సమావేశం నిర్వహించారు. నాయకులు చీకురుపాటి కుమారస్వామి, బోడిరెడ్డి ఆదిలక్ష్మి, పైడా కృష్ణమోహన్, యార్లగడ్డ రామ్‌కుమార్, పైడా భవనప్రసాద్, రెడ్డి లోవరాజు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా బీజేపీ సెంట్రల్ మండల అధ్యక్షురాలు గోడి సత్యవతి ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

జగన్మాతా పాహిమాం



వీణాపాణిగా సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి అమ్మవారు



దేవాలయం వీధిలో రాజరాజేశ్వరీదేవిగా బాలాత్రిపుర సుందరి అమ్మవారు



భానులింగేశ్వరస్వామి ఆలయంలో కాత్యాయని అలంకరణలో..



కరప శివాలయంలో వీణాపాణి అవతారంలో పర్వతవర్ధినీదేవి



వలసపాకలలో దుర్గాదేవి అమ్మవారు

- భక్తిశ్రద్ధలతో దుర్గామాతకు పూజలు
- భక్తులతో రద్దీగా ఆలయాలు



హ్రీం పీఠంలో దేవి కూష్మాండ అలంకరణ

కరప: శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి.. నాల్గోరోజు గురువారం దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కరప, వలసపాకల, నడకుదురు, పెనుగుదురు, జెడ్.భావారం, కొరుపల్లి తదితర గ్రామాల్లోని దుర్గాదేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. కరపలోని విశ్వాలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి గోపాలకృష్ణ, అనంతాచార్యులు, శివాలయంలో ప్రధాన అర్చకుడు విలపర్తి శ్రీనివాస్‌లు పర్వతవర్ధినీదేవిని వీణాపాణి అవతారంలో అలంకరించారు. ఈ ఏర్పాట్లను ఈఓ కె.తిరుమల రవితేజ, సీహెచ్ శ్రీను పర్యవేక్షించారు. కరప మార్కెట్ యార్డు వద్ద విజయదుర్గా ఆటో యూనియన్ సభ్యులు, గ్రామస్తులు దుర్గాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. కరప దుర్గాదేవి ఆలయంలో వేకువజాము నుంచే మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి కుంకుమ పూజలు చేయించుకున్నారు. అర్చకుడు కొంపెల్ల చక్రధర్ పూజాదికాలు నిర్వహించారు. కమిటీ సభ్యులు మేడిశెట్టి పెద్దకాపు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. వలపాకలలోని దుర్గాదేవి ఆలయంలో భవానీలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

బోట్‌క్లబ్: నగరంలో శరన్నవరాత్ర ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారు వీణాపాణి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.



అయ్యప్పస్వామి ఆలయంలో బాలపూజ నిర్వహిస్తున్న దృశ్యం

అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. మంజీర నాట్యాలయం విద్యార్థుల నృత్య ప్రదర్శన, నాట్యారాధన మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ విద్యార్థుల నాట్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా దర్శనమిచ్చారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వర స్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరీ అమ్మవారు కాత్యాయనిగా భక్తులకు దర్శనమిచ్చారు. రిజర్వు లైన్ అయ్యప్పస్వామి ఆలయంలో బాల పూజ జరిగింది. అశోక్‌నగర్ సాయిబాబా మందిరంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. అమ్మవారికి తెల్ల చామంతి పుష్పాలతో పూజ చేశారు. మందిర కమిటీ చైర్మన్ వేదుల అచ్యుతరామారావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. స్థానిక సంతచెరువు కనకదుర్గమ్మ ఆలయం, శారదాదేవి ఆలయంతో పాటు పలు అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.



రమణయ్యపేట శ్రీపీఠంలో గాయత్రీదేవిగా ఐశ్వర్యాంబిక

కాకినాడ రూరల్: రమణయ్యపేట శ్రీపీఠంలో ఐశ్వర్యాంబిక అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి గాయత్రీ, సౌర హోమం నిర్వహించారు. రమణయ్యపేట ఏపీఎస్పీ వద్ద హ్రీం పీఠంలో ఈశ్వర్‌నాథ్ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా వేడుకల్లో భాగంగా లలితా పరమేశ్వరి అమ్మవారు దేవి కూష్మాండ అలంకరణలో దర్శనమిచ్చారు. మండలంలో పలు గ్రామాల్లో శరన్నవరాత్ర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.



శ్రీహరి కల్పతరు కూచిపూడి నృత్య రూపకంలో ఓ ఘట్టం

ఆకట్టుకున్న నృత్య రూపకం

బోట్‌క్లబ్: స్థానిక సూర్యకళా మందిరంలో సరస్వతీ గానసభ దసరా సంగీత, నృత్య, నాటకోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి బెంగళూరుకు చెందిన డాక్టర్ వసంత్‌కిరణ్ శ్రీహరి లీలా కల్పతరు అంశంపై చేసిన కూచిపూడి నృత్య రూపకం ప్రేక్షకులను కట్టిపడేసింది. వివిధ ఘట్టాల్లో బృందం చేసిన నృత్యానికి నగర ప్రజలు మైమరచిపోయారు. తొలుత సరస్వతీ గానసభ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం



రమణయ్యపేటలో పరిశుభ్రతా కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలో ఏక్ దిన్, ఏక్ ఘంటా, ఏక్ సాత్ పరిశుభ్రతా కార్యక్రమాన్ని గురువారం ఉదయం నిర్వహించారు. వలసపాకల రోడ్డు ఎస్ఆర్ఎంటీ గెస్ట్ హౌస్ వద్ద నుంచి రమణయ్యపేట కూరగాయల మార్కెట్ వరకూ చెత్తను తొలగించే కార్యక్రమంలో కలెక్టర్ షణ్మోహన్ పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులతో కలసి సుమారు గంట పాటు చీపుర్లతో చెత్తను ఊడ్చి రిక్షాలో వేశారు. పరిశుభ్రతా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని పిలుపునిచ్చారు. జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, డీఎల్‌పీఓ అన్నామణి, డీఎల్‌డీఓ వాసుదేవరావు, ఎంపీడీఓ పి.సతీష్, ఈఓ పీఆర్‌డీ సీతారామాంజనేయులు, పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

కరప: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు అంతా సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్‌వీ శ్రీనివాసరావు కోరారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా కరపలో ప్రజాప్రతినిధులు, పంచాయతీ, ఉపాధి హామీ పథకం సిబ్బంది, పారిశుధ్య కార్మికులతో కలసి శ్రమదానం చేసి రోడ్డు పక్కన చెత్తాచెదారాన్ని తొలగించారు. ఏపీఓ పి.ప్రభాకరరావు, గ్రామ కార్యదర్శి యు.నిర్మలాదేవి, పీఏసీఎస్ చైర్మన్ ఎస్.భవానీశంకర్ తదితరులతో కలసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే పలు గ్రామాల్లో ఏక్ దిన్ ఏక్ గంటా ఏక్‌సాత్ కార్యక్రమాన్ని జరిపారు.

బోట్‌క్లబ్: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత కోసం రోజుకు ఒక గంట సమయాన్ని కేటాయించాలని నగరపాలక సంస్థ కమిషనర్ భావన అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఏక్ దిన్, ఏక్ గంట, ఏక్ సాత్ పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా స్థానిక సురేష్‌నగర్ పార్కును శుభ్రం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుత అలవాట్లు అలవర్చుకోవాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలన్నారు. సమాజానికి శుభ్రమైన వాతావరణాన్ని అందించడంలో పారిశుధ్య కార్మికుల కృషి మరువలేనిదన్నారు. అదనపు కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.శ్రీనివాసరావు, ఎంహెచ్ఓ పృథ్వీ చరణ్, డీసీపీ కేవీ కృష్ణారావు పాల్గొన్నారు.



పార్కును శుభ్రం చేస్తున్న నగరపాలక సంస్థ కమిషనర్ భావన తదితరులు

చెత్తశుద్ధి ఇదేనా!

సామర్లకోట: స్వచ్ఛత పక్షోత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు అట్టహాసంగా నిర్వహిస్తున్నారు. అయితే స్థానిక తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాల వెనుక భాగంలో కంపోస్టు యార్డులా చెత్త పేరుకుపోయినా పట్టించుకునేవారే కరవయ్యారు. ప్రభుత్వ కార్యాలయాల వెనుక చెత్త, తుప్పలు పెరిగిపోయాయి. దీంతో సమీపంలోని తమ ఇళ్లలోకి విష సర్పాలు వస్తున్నాయని, ఆ ప్రాంత వాసి వీసం వీరనాగు అన్నారు. ఒకవైపు అల్లూరి సీతారామరాజు పార్కు, మరో వైపు ప్రభుత్వ కార్యాలయాల మధ్యలో చెత్త పెరిగినా పట్టించుకోవడం లేదు. స్వచ్ఛతపై అధికారులు ప్రచారం చేస్తుండగా, వారి కార్యాలయాల వద్దే చెత్త పేరుకుపోవడం శోచనీయం.



తహసీల్దార్, ఐసీడీఎస్ కార్యాలయాల వెనుక పెరిగిన చెత్త, తుప్పలు